క్లుప్తంగా

ప్రజలకు సత్వర న్యాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి సత్వర న్యాయం అందేలా చూడాలని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూపం రాజు కోరారు. తాలూకా సీఐ పి.రాజాను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని బుడగ జంగం కాలనీలో నిరుపేదలు అధికంగా నివశిస్తున్నారని, విద్యకు దూరంగా నిరక్షరాస్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు పవన్ కల్యాణ్, జనార్దన్, బ్రహ్మయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతతో సత్ఫలితాలు



చేతిరాతలో శిక్షణ ఇస్తున్న మౌనిక

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి విద్యార్థి చేతిరాత మెరుగుపరుచుకోవాలని సఖీ ఫౌండేషన్ బృందం సభ్యులు మౌనిక, రహమతున్నీసా తెలిపారు. కడప నగరంలోని ప్రకాశ్ నగర్‌లోని జేఎస్‌టీఎస్ హోంలో సఖీ ఫౌండేషన్, ఇంపాక్ట్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ ప్రోగామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి చేతిరాతతో పరీక్షల్లో అధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. ఇందుకుగానూ విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖీ ఫౌండేషన్ ప్రతినిధులు సునీత, జ్యోతి, నస్రత్, ఫర్హనాజ్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన టమాట ధర

కడప అగ్రికల్చర్: కొండెక్కి కూర్చొన్న టమాట ధర అమాంతంగా తగ్గిపోయింది. రైతు బజార్‌లో కిలో టమాట ధర రూ.10 పలుకుతోంది. రెండు నెలల కిందట రూ.100 పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తి పోయారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని 50 శాతం రాయితీతో కొనుగోలు చేసి రైతు బజార్‌లో వినయోగదారులకు అందించాల్సి వచ్చింది. అయితే తాజాగా ధర కిలో రూ.10కి చేరింది.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్‌చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆది వారం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని అమలుపరచడానికి ఉత్సాహం చూపుతోందన్నారు. పాత పెన్షన్ మాత్రమే ఆమోద్యయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, సుజాత, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసులు, రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కడప కల్చరల్: దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో సేవా పక్వాడ పేరిట పోస్టర్‌ను ఆదివారం సంస్థ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఆదివారం నుంచి అక్టోబర్ 2వరకు రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానంపై అవగాహన, రక్త గ్రూప్ నిర్ధారణ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్, ప్రసాద్, శైలేంద్రనాథ్, తారిఖ్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో జరుగుతున్న అక్రమాలు అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెద్ద పసుపులలో 115 క్వింటాళ్ల పసుపు మాయంపై విచారణ జరిపించి దోషులను శిక్షించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. 2018–19లో కేంద్ర ప్రభుత్వం 1600 టన్నుల పసుపు కొనుగోలు చేసి ఎన్సీఎంఎల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం పెద్దముడియం మండలం పెద్దపసుపుల వద్ద వేర్‌హౌస్‌లో నిల్వ చేశారన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం రూ.1.26 కోట్ల విలువగల పసుపు మాయంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

కడప కార్పొరేషన్: మట్టి విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. స్థానిక అప్సర థియేటర్ వద్ద బాషా మొబైల్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. సురేష్ బాబు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో భూమి, నీరు కలుషితమై ప్రాణులకు హాని కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.సూర్యనారాయణరావు, ఎం.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున కిరణ్, బాలక్రిష్ణారెడ్డి, సింధు, వేణుగోపాల్ నాయక్, యల్లారెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు. కడప నగరంలోని వై జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రజా జనరిక్ మెడికల్ స్టోర్‌ను మేయర్ సురేష్ బాబు ఆదివారం ప్రారంభించారు.మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ సురేష్ బాబు



విగ్రహాలను అందజేస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తం

కడప కార్పొరేషన్: వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే కమిటీ సభ్యులు విద్యుత్తు భద్రతా నియమాలు పాటించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ సూచించారు. విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వినాయక పందిళ్లకు రుసుము చెల్లించి విద్యుత్తు తాత్కాలికంగా వాడుకోవాలన్నారు. తీగలకు అతుకులు లేకుండా నాణ్యమైన ఉపకరణాలు ఉపయోగించాలన్నారు. విద్యుత్తు తీగలు, నియంత్రికలు ఉన్న చోట పందిళ్ల ఏర్పాటు చేయవద్దన్నారు. ఇనుప పైపులకు బదులుగా కొయ్యలు, ప్లాస్టిక్ పైపులు ఉపయోగించుకోవాలన్నారు. వైర్ జాయింట్ల వద్ద విధిగా ఇన్సులేషన్ టేపర్లు వాడాలన్నారు. భారీ విగ్రహాలను ఊరేగించేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉత్సవాలలో భక్తే ప్రధానం

కడప కల్చరల్ : వినాయక చవితి ఉత్సవాలను భక్తే ప్రధానంగా నిర్వహించాలని, కార్యక్రమ నిర్వహణలో యువకులు ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేశారు. డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ హిత మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా అధికారులు ఏక తాటిపై శాంతిభద్రతలను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పందిళ్ల ఏర్పాటు కోసం సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండూరు జనార్దన్‌రాజు, గౌరీశంకర్, రవీంద్రనాథ్, చంద్ర ఓబుల్‌రెడ్డి, కొండారెడ్డి, ముకేష్‌కుమార్, మహమూద్ పాల్గొన్నారు.

మట్టి వినాయకులను ఏర్పాటుచేయాలి

కడప కార్పొరేషన్: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు వాడాలని కమలాపురం శాసన సభ్యుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక మురళి థియేటర్ సమీపంలో 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, ఐస్‌క్రీం రవిల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో నీరు, భూమి కలుషితమవుతాయన్నారు. ఐస్‌క్రీం రవి మాట్లాడుతూ పదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీ వెంకటసుబ్బమ్మ, పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన టు కే రన్

కడప కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టు కే రన్ ఉత్సాహంగా సాగింది. స్థానిక స్పోర్ట్స్ స్కూల్ వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డిలు ఆదివారం ఉదయం టు కే రన్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ స్కూల్ నుంచి ప్రారంభమైన రన్ పాలకొండల వరకూ చేరింది. అక్కడ విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు. మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా కమిషనర్, డీఎఫ్‌ఓ మాట్లాడుతూ కడపను పరిశుభ్రమైన నగరంగా తయారు చేయడానికి ప్రజలంతా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు సుదర్శన్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, ఎ.బాలక్రిష్ణారెడ్డి, నగరపాలక, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



టు కే రన్‌లో పాల్గొన్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి తదితరులు

వాస్తు, హస్త కళలకు ఆద్యుడు విశ్వకర్మ

కడప కార్పొరేషన్: వాస్తు, శిల్ప, హస్త కళలకు ఆద్యుడు విశ్వకర్మ అని కమలాపురం శాసన సభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. హిందూ సంప్రదాయాల ప్రకారం విశ్వకర్మను డివైన్ ఇంజినీర్‌గా పిలుస్తారన్నారు. దేవతలకు అద్భుతమైన ఆయుధాలను సృష్టించిన ఈయన దివ్య వడ్రంగి అని తెలిపారు. వెనుకబడిన వర్గాల(బీసీ) కోరిక మేరకు ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి, మహిళా నేతలు బండి మరియ, సంధ్యారాణి, ఉమామహేశ్వరి, రత్నకుమారి, మూలే సరస్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

గడప గడపకు.. ఓ మంచి కార్యక్రమం

- సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు భేష్.. ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయి
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : గడప గడపకు మన ప్రభుత్వం.. ఓ మంచి కార్యక్రమం అని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ బాగా పని చేయడం వల్లనే ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సక్సెస్ కావడంతో ఆదివారం తిప్పలూరులోని ఏకేఆర్ కల్యాణ మండలంలో జేసీఎస్ కన్వీనర్, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్స్ ఉన్న నాయకుడని కొనియాడారు. మీపై ఎంతో నమ్మకం ఉంచి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారని, అయితే మీరంతా బాగా పనిచేయడం వల్లనే గడప గడపకు వెళ్లినపుడు పెద్దగా సమస్యలు రాలేదన్నారు. మండలంలో దాదాపు 19వేల ఇళ్లను సందర్శించానని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను దాదాపు 95 శాతం వరకు పరిష్కరించానన్నారు.

ప్రతి సచివాలయాన్ని సందర్శిస్తా:

ఇక నుంచి రోజూ ఒక సచివాలయాన్ని సందర్శిస్తానని, ఇంకా ఎవైన సమస్యలుంటే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 15 మంది నియోజకవర్గాల్లోని అన్ని ఇళ్లను సందర్శించానని, అందులో నేను ఒకడినన్నారు. స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కుప్పంకు కూడా తీసుకురానన్ని నిధులు మన ఎమ్మెల్యే కమలాపురంకు తీసుకువచ్చారన్నారు. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మైనార్టీ కమిషన్ మెంబర్ హిదాయత్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం అన్నారు. ముచ్చటగా మూడో సారి కూడా మన ఎమ్మెల్యేను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన వారికి వార్కస్ ఎల్మక్ స్కూటీ బహుమతిగా ఇస్తున్నామన్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈగా కుళాయప్ప

బద్వేలు అర్బన్ : ఏపీఎస్‌పీడీసీఎల్ బద్వేలు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎం.కుళాయప్ప ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం డీఈఈగా పనిచేస్తున్న ఈయనను బద్వేలు డీఈఈగా బదిలీచేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వపు విద్యార్థులు

చక్రాయపేట : స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1998లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు సంగిరెడ్డి, బాలనారాయణ, రామకృష్ణ, సూర్య నారాయణరెడ్డి, ఆదినారాయణ, ఖాసింబీ, ఆదినారాయణలను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. నాటి సోదరీమణులకు చీరలు ఇచ్చి సత్కరించారు. నాటి గురువులతో తమకు ఉన్న అనుబంధాలను తోటి మిత్రుల తీపిగుర్తులను పంచుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో నిర్వహణకు కృషి చేసిన మను, శివరామాచారి, సుధాకర్, మునిరెడ్డిలను అభినందించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్–14, 16, 18 బాలబాలికలకు, అండర్–20 స్త్రీ, పురుషులకు 60, 100, 200, 300, 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హై జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభకనబరిచిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు అహమర్ బాషా, వ్యాయామ సంచాలకులు బనగానపల్లె బాషా, నరేష్, లక్ష్మీ, నాగేశ్వరరావు, రాజశేఖర్, రవి, కేశవ, తదితరులు పర్యవేక్షించారు.



పరుగు పోటీలో క్రీడాకారులు

బొజ్జగణపయ్యా.. కదలిరావయ్యా

గణపయ్యను కొలువుదీర్చేందుకు కాయ, పండ్లు కొనేవారితో నగరం కిటకిట లాడింది. వైఎస్సార్ జిల్లాలోని ఓల్డ్‌టౌన్ ఆవరణంతా మట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులతో నిండిపోయింది. అవసరమైన పండ్లు ఒకేచోట కొనేలా వ్యాపారులు అన్నీ ఒకచోట కూర్చి అందుబాటులో ఉంచారు. అరటి పిలకలు, మామిడి ఆకులు కొనేందుకు వచ్చిన వారితో సందడిగా కనిపించింది. ఉదయం నుంచి గణపతి విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చేవారు సైతం కొనుగోలు చేసేందుకు రావడంతో ఇసుకేస్తే రాలనంత జనంతో నిండి పోయింది. ప్రధాన రోడ్లు, వీధి కూడళ్లే కాకుండా సందుగొందులు సైతం ఉత్సవ శోభతో కళకళలాడాయి. అరటి పిలకలు, మామిడికాకులు, పత్రి, వెలగపండ్లు, మొక్కజొన్న కంకులు ఇలా ఏ వస్తువు కొన్నా ధర అమాంతం పెంచేశారు. పాత బస్టాండు, రాజీవ్ మార్గ్, ఐటీఐ సర్కిల్, అప్సర సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ తదితర ప్రధాన కూడళ్లలోనూ సందడి కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



నగరంలోని ఓల్డ్ టౌన్‌లో అరటి ఆకులు, పూజా సామాగ్రి కొనుగోళ్లు



పందిళ్లకు గణపతులను తరలిస్తూ



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు

సీఎస్‌సీ పేర్లు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న బాలకృష్ణ యాదవ్

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద సీఎస్‌సీలో పేర్లు నమోదు చేసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్ తెలిపారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలో పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 రకాల కులవృత్తుల వారికి రూ.3 లక్షల రుణ సదుపాయం కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప అసెంబ్లీ భాజపా కన్వీనర్ బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్‌రావు, కల్యాణ్, శారద, పద్మాభాయి, అంబిక, లక్ష్మీనారాయణ రెడ్డి, బాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.